
సాక్షి ఖమ్మం

శనివారం ၊ 9 ၊ నవంబర్ ၊ 2024



ఏడేళ్లయినా జాడే లేని బోర్డు

జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ట్రస్టు బోర్డు ఏర్పాటులో జరుగుతున్న జాప్యంతో అభివృద్ధి నెమ్మదిస్తోంది. 10లో



యాసంగికి విత్తనాలు సిద్ధం

యాసంగిలో రైతులు సాగు చేయనున్న పంటల అంచనా మేరకు అధికారులు విత్తనాలను సిద్ధం చేస్తున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 22°

వాతావరణం

జిల్లాలో శనివారం చలి ప్రభావం పెరుగుతుంది. మధ్యాహ్నం మాత్రం సాధారణ ఉష్ణోగ్రతలే ఉంటాయి.

న్యూస్‌రీల్

అదనపు డీసీపీని అభినందించిన అధికారులు



ప్రసాద్‌రావు

ఖమ్మంక్రైం: పోక్సో కేసులో నిందితుడికి 30ఏళ్ల జైలు శిక్ష పడేలా పకడ్బందీ సాక్ష్యాధారాలు సమర్పించిన ఖమ్మం అదనపు డీసీపీ జి.ప్రసాద్ రావు పోలీసు అధికారులు అభినందించారు. ఆయన హైదరాబాద్ మీర్‌చౌక్ ఏసీపీగా పనిచేసిన సమయాన దబీపూరకు చెందిన క్యాబ్‌డ్రైవర్ మీర్ గుల్జార్ అలీ మైనర్‌పై లైంగిక దాడి చేయడంతో పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసారు. కేసు విచారణ చేపట్టిన ప్రసాద్‌రావు పక్కా సాక్ష్యాలను కోర్టుకు సమర్పించడంతో నిందితుడికి 30ఏళ్ల జైలుశిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడైంది. ఈ సందర్భంగా ప్రస్తుతం అదనపు డీసీపీగా ఉన్న ఆయనను హైదరాబాద్, ఖమ్మం పోలీసు అధికారులు అభినందించారు.

ధాన్యం కొనుగోళ్లలో నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ శ్రీనివాసరావు

ఖమ్మంవ్యవసాయం: రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే సమయాన ప్రభుత్వ నిబంధనలు పాటించాలని డీసీఎంఎస్(జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ) చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు సూచించారు. ఖమ్మంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌ల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీసీఎంఎస్ ద్వారా జిల్లాలో 27 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయగా, 'ఏ' గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2,320గా, సాధారణ రకానికి రూ.2,300 ధర నిర్ణయించినట్లు చెప్పారు. ఇదికాక సన్నరకాలు క్వింటాకు రూ.500ల బోనస్ అందుతుందని తెలిపారు. ఈమేరకు కేంద్రాల్లో రైతులు ఇబ్బంది పడకుండా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ కె.సందీప్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనోత్పత్తి మోసాలపై అప్రమత్తంగా ఉండాలి




మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య, తదితరులు

ఖమ్మంవ్యవసాయం: యాసంగి సీజన్ సమీపిస్తున్న దృష్ట్యా అపరిచితులు గ్రామాల్లో తిరుగుతూ విత్తనోత్పత్తి పేరిట విత్తన విక్రయాలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని జిల్లా వ్యవసాయాధికారి(డీఏఓ) ధనసరి పుల్లయ్య సూచించారు. ఖమ్మంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయాధికారులు, వివిధ కంపెనీల విత్తన ప్రతినిధులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ గ్రామాల్లో తిరుగుతున్న మొక్కజొన్న, పత్తి విత్తనాలను రైతులకు అంటగట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఈవిషయంలో రైతులు అప్రమత్తమై అనుమతి ఉన్న కంపెనీల విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలని, అంతేకాక పంట సాగు చేశాక విత్తనాలను తిరిగి కొనుగోలు చేస్తామని ఒప్పందం చేసుకోవాలని సూచించారు. ఈ అంశంపై అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. తొలుత ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం తదితర మండలాల్లో సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను ఆయన పరిశీలించారు. ఏడీఏలు కొంగర వెంకటేశ్వరరావు, టి.కరుణశ్రీ, వి.శ్రీనివాసరెడ్డి, ఏఓలు పవన్, కిషోర్ బాబు, బాలాజీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇళ్ల గుర్తింపు.. 85.12శాతం

ఖమ్మం సహకారనగర్: సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా జిల్లాలో గురువారం కూడా ఇళ్ల గుర్తింపు కొనసాగింది. బుధవారం గుర్తింపు మొదలుకాగా గురువారం నాటికి పూర్తిచేసి శుక్రవారం సర్వే ప్రారంభించాలని కార్యాచరణ రూపొందించారు. అయితే, శుక్రవారం నాటికి 5,36,335 ఇళ్లలో 4,56,509 ఇళ్లను గుర్తించగా 85.12 శాతంగా నమోదైంది. అయితే, మరోపక్క ఇదే రోజు ఇంటింటి సర్వే కూడా ప్రారంభించారు. బ్లాక్‌ల వారీగా ఇంటింటికీ వెళ్లి కుటుంబ వివరాలు నమోదు చేయడం మొదలుపెట్టారు. మొత్తంగా 3,654 బ్లాకుల్లో 3,810 మంది ఎన్యూమరేటర్లు విధులు నిర్వర్తిస్తుండగా 317 మంది సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తున్నారు.



ఒకప్పుడు నామమాత్రంగా ఉన్న స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) ఇప్పుడు రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. గతంతో పోలిస్తే పరిధి గణనీయంగా పెరగడమే ఇందుకు కారణమైంది. ఫలితంగా ఒక్కసారిగా జిల్లా రాజకీయాల్లో 'సుడా' కీలకం కావడంతో చైర్మన్, డైరెక్టర్ల పదవులు దక్కించుకునేందుకు నేతలు ఉవ్విళ్లూరుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, ఖమ్మం

సుడా.. పీఠముడి!

పరిధి పెరగడంతో హాట్‌సీట్‌గా చైర్మన్ పదవి

- డైరెక్టర్ల పదవులకు సైతం అదే స్థాయిలో పోటీ
- మూడు మండలాలు మినహా జిల్లా అంతటా విస్తరణ
- మాస్టర్‌ప్లాన్‌కు తోడు భారీగా విడుదల కానున్న నిధులు

ఆ మండలాలు తప్ప

తొలుత ఖమ్మం కార్పొరేషన్, వైరా మున్సిపాలిటీతో పాటు నాలుగు మండలాలు, 44 గ్రామపంచాయతీలతో సుడా ఏర్పడింది. ఇప్పుడు జిల్లాలోని కారేపల్లి, కామేపల్లి, ఏన్కూరు మండలాలు మినహా జిల్లా అంతటా విస్తరిస్తూ తాజాగా నిర్ణయించారు. దీంతో సుడా వేదికగా అభివృద్ధి పరుగులు తీయనుండడమే కాక రాజకీయంగానూ కొత్త పుంతలు తొక్కనుంది. ఇప్పటి వరకు సుడా చైర్మన్ పదవిని అలంకార ప్రాయంగానే చూసినా నేతలు విస్తృత పరిధి దృష్ట్యా ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. జిల్లాలోని ముగ్గురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులతో సమన్వయంతో పనిచేసే పదవి కావడం.. అభివృద్ధి పనులకు నిధులు భారీగా విడుదల కానుండడంతో మౌలిక వసతుల కల్పనలో పాలకవర్గం తీసుకునే నిర్ణయాలు కీలకం కానున్నాయి.

లే ఔట్ల అనుమతుల, అభివృద్ధి పనులు

2017 అక్టోబర్ 24న సుడా ఏర్పడింది. ఖమ్మం కార్పొరేషన్, వైరా మున్సిపాలిటీకి తోడు సమీప మండలాలతో తొలినాళ్లలో ఏర్పడగా వెంచర్లు, లే ఔట్లకు అనుమతులు ఇవ్వడం, ఇతర అభివృద్ధి పనుల పర్యవేక్షణ చేపట్టేవారు. కాగా, సుడా పాలకవర్గాన్ని కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రద్దు చేసింది. అయితే, పట్టణీకరణ వేగంగా జరుగుతున్న నేపథ్యాన సుడాలో సత్తుపల్లి, మధిర మున్సిపాలిటీలతోపాటు 279 గ్రామపంచాయతీలను చేర్చారు. దీంతో ఇప్పుడు జిల్లాలోని ఏన్కూరు, కామేపల్లి, కారేపల్లి మండలాలు మినహా మిగిలిన ప్రాంతమంతా ఈ పరిధిలోకి వచ్చినట్లయింది.

సమగ్ర మాస్టర్ ప్లాన్

సుడా పరిధితో పాటే నిధుల విడుదల కూడా అదేస్థాయిలో ఉంటుందని తెలుస్తోంది. అభివృద్ధి కోసం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల ప్రాధాన్యాన్ని గుర్తించిన ప్రభుత్వం మాస్టర్‌ప్లాన్ రూపకల్పనపై సూచనలు చేసినట్లు సమాచారం. ఒక కార్పొరేషన్, మూడు మున్సిపాలిటీలు, 17 మండలాలు, 323 జీపీలతో ఏర్పడిన సుడా మాస్టర్ ప్లాన్‌పై ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని తెలిసింది. అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు ఇది ఉపయోగపడనుంది.

డైరెక్టర్ పదవులు మరిన్ని..

ముగ్గురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల పరిధిలో ప్రస్తుతం సుడా ఉండడంతో వీరందరినీ సమన్వయం చేసుకుంటూ పాలకవర్గం పనిచేయాల్సి ఉంటుంది. అభివృద్ధి, రాజకీయ నిర్ణయాల్లోనూ వీరి పాత్ర కీలకం కానుంది. గతంలో చైర్మన్‌తో పాటు పద్నాలుగు మంది డైరెక్టర్లు ఉండగా.. రెండేళ్ల కాలానికి కొత్త పాలకవర్గాన్ని నియమించాల్సి ఉంది. అయితే, పరిధి పెరిగిన నేపథ్యాన డైరెక్టర్ పదవులు కూడా పెరుగుతాయని సమాచారం.

అందరికీ ఆసక్తే..

గతంలో కేవలం నాలుగు మండలాలకే పరిమితం కావడంతో సుడా చైర్మన్ పదవిపై ఎక్కువ మంది ఆసక్తి చూపలేదు. ఇప్పుడు పరిధి పెరగడం.. అభివృద్ధి నిధుల కేటాయింపు, మాస్టర్‌ప్లాన్ రూపకల్పన చేయాల్సి ఉండడంతో చైర్మన్ పదవి లేదంటే డైరెక్టర్‌గానైనా స్థానం దక్కించుకోవాలనే ఆలోచనలు పలువురు నేతలు ఉన్నట్లు తెలుస్తోంది. కొందరు బడా నేతలు కూడా చైర్మన్‌గిరీ కోసం పోటీలో ఉన్నామని సంకేతాలు ఇస్తున్నారు. ఈ పదవితో రాజకీయంగా కలిసి వస్తుందని అధికార పార్టీ నేతలు తమ అనుయాయులతో చర్చిస్తూ జిల్లా మంత్రులను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నట్లు సమాచారం. భవిష్యత్‌లో రాజకీయ ఎదుగుదలకు ఈ పదవి సోపానంలా ఉపయోగపడుతుందని చెబుతున్న ఆశావహులు పెరగడంతో ఎవరిని పదవి వర్తిస్తుందనే చర్చ కాంగ్రెస్‌లో జోరుగా సాగుతోంది.

నేను.. నా మధిర



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క , పక్కన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

- ఈనెల 14న 'క్లీన్ అండ్ గ్రీన్'కు శ్రీకారం
- కలెక్టర్, అధికారులతో సమీక్షించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న డిప్యూటీ సీఎం

మధిర: దేశ తొలి ప్రధాని నెహ్రూ జయంతి సందర్భంగా ఈనెల 14న 'నేను.. నా మధిర' పేరిట క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు. మధిరలోని క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఇతర అధికారులతో శుక్రవారం ఆయన మున్సిపల్ కార్యకలాపాలపై సమీక్షించారు. తొలుత మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ, అభివృద్ధి పనులు, భవిష్యత్ ప్రణాళికలను మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ వివరించారు. అనంతరం భట్టి మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ప్రజల భాగస్వామ్యంతో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపర్చేందుకు 'నేను.. నా మధిర' పేరిట కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. ఇందులో భాగంగా ప్రతీ ఇంటికి రెండేసి బుట్టలు పంపిణీ చేసి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని, రహదారుల శుభ్రత కోసం స్వీపింగ్ మిషన్లు కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఇంకా ఖాళీ స్థలాల పరిశుభ్రత, పారిశుద్ధ్య వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ అమర్చడం, పార్కుల్లో పచ్చదనం ఉట్టిపడేలా తీర్చిదిద్దడంపై సూచనలు చేశారు. కాగా, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం పూర్తయ్యే వరకు సీసీ రోడ్ల పనులు చేపట్టొద్దని సూచించారు.

కాలేజీ స్థలంలో ఐటీఐ

ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలంలో ప్రభుత్వ ఐటీఐ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్‌కు డిప్యూటీ సీఎం భట్టి సూచించారు. ఆతర్వాత మహదేవపురం ఎత్తిపోతల పథకం పనులు, జాలిముడి ఎడమ, కుడి కాల్వల మరమ్మతులు, మధిరలో వైరా నదికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణం సాగర్ ఆయకట్టుకు నీటి విడుదలపై సూచనలు చేశారు. ఈసమావేశంలో నీటిపారుదల శాఖ డీఈ నాగబ్రహ్మయ్య, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, మున్సిపల్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

చింతకాని: ప్రజల అభివృద్ధి, సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. చింతకాని మండలంలోని పలుగ్రామాల్లో రూ.22.10 కోట్లు సీఆర్ఆర్ నిధులతో చేపట్టే బీటీ రహదారుల పనులకు శంకుస్థాపన చేసిన ఆయన చింతకాని సొసైటీ కార్యాలయంలో అదనపు భవనం, గోదాంను ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో జరిగేలా ప్రణాళికలు అమలుచేస్తున్నామని తెలిపారు. అలాగే, మత్కేపల్లి తుమ్మలమ్మ చెరువు గట్టుపై శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసిన ఆయన కామేపల్లి మండలం అడవిమద్దులపల్లికి చెందిన మల్లెబోయిన ఉపేందర్, పద్మ దంపతుల కుమార్తె లాత్వికకు అన్నప్రాసన చేశారు. ఈసందర్భంగా చింతకాని సొసైటీ పాలకవర్గ సభ్యులు భట్టివిక్రమార్కను సన్మానించగా, పందిళ్లపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సమావేశాల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ డి.వెంకటేశ్వరరావు, సొసైటీల చైర్మన్లు కొండపల్లి శేఖర్‌రెడ్డి, నల్లమోతు శేషగిరిరావు, ఆర్డీఓ నర్సింహారావు, వివిధ శాఖల అధికారులు వెంకటరెడ్డి, రాంబాబు, చైతన్య, కూరపాటి అనంతరాజు, రామయ్య, శ్రీనివాసరావు, నాయకులు పోట్ల నాగేశ్వరరావు, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, అంబటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అవసరాలు తెలుసుకోవడానికే సర్వే

- దేశానికే రోల్ మోడల్‌గా తెలంగాణ
- కోటనారాయణపురంలో ప్రారంభించిన మంత్రి పొంగులేటి



కోటనారాయణపురంలో సర్వేను ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



దానవాయిగూడెం గురుకుల విద్యార్థినులతో కలిసి స్నాక్స్ తీసుకుంటున్న మంత్రి

ఖమ్మంరూరల్: ప్రతీ కుటుంబం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవసరాలు తెలుసుకోవడానికే ప్రభుత్వం కుటుంబ సమగ్ర సర్వే చేపడుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి. శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఖమ్మం జిల్లా రూరల్ మండలంలోని కోటనారాయణపురంలో కుటుంబ సమగ్ర సర్వేను మంత్రి శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రశ్నావళి ఆధారంగా వివరాలు ఆరా తీస్తూ నమోదు చేయించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అందరి వివరాలు తెలిస్తే ఎవరికి ఏం చేయాలో తెలుస్తుందన్నారు. ఈమేరకు సిబ్బంది పకడ్బందీగా వివరాలు సేకరించాలని ఆదేశించారు. ఈ సర్వే ద్వారా దేశంలోనే తెలంగాణ ఆదర్శంగా నిలవనుందని చెప్పారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మంత్రి పొంగులేటి కేక్ కట్ చేశారు.

మెరుగైన విద్య అందించడమే లక్ష్యం

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని రామన్నపేట ఉన్నత పాఠశాల విద్యార్థినులకు పీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా సైకిళ్లను పంపిణీ చేశాక ఆయన మాట్లాడారు. ప్రతీ మండలంలో ఒక పాఠశాలలో సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, బీసీ సంక్షేమ అధికారి జి.జ్యోతి, డీఈఓ సోమశేఖరశర్మ, అదనపు డీఆర్‌డీఓ నూరుద్దీన్, ఆర్‌డీఓ నర్సింహారావు, తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీఓ కుమార్, ఎంపీఓ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బంది పెడితే చర్యలు

నేలకొండపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించడమే కాక రైతులు నష్టపోకుండా అధికారులు పర్యవేక్షించాలని.. అలా కాకుండా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. నేలకొండపల్లి మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఆయన కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు, దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేయడంతో పాటు సీఎం పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు ఇబ్బంది పడకుండా ధాన్యం కొనుగోళ్లు చేస్తామని తెలిపారు. ఆతర్వాత నేలకొండపల్లి గురుకుల బాలికల పాఠశాలను సందర్శించిన మంత్రి సౌకర్యాలపై ఆరా తీసి విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఆర్డీఓ నర్సింహారావు, మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు శాఖమూరి రమేష్, వెనికె జానకీరామయ్య, కొర్లకుంట్ల నాగేశ్వరరావు, రాయపూడి నవీన్, బచ్చలకూరి నాగరాజు, అంజిని తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో సమస్యల పరిష్కారం

ఖమ్మంమయూరిసెంటర్: దానవాయిగూడెం సాంఘిక సంక్షేమ గురుకులంతో పాటు ఇతర గురుకులాల్లో సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం దానవాయిగూడెంలో గురుకుల కళాశాలకు ఆయన పీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా డైనింగ్ టేబుళ్లు, కుర్చీలు అందజేసి మాట్లాడారు. గురుకులంలో విద్యుత్ సరఫరా, ప్రహరీ నిర్మాణం, ఇతర సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అనంతరం మంత్రి విద్యార్థినులతో కలిసి అల్పాహారం తీసుకోగా ముఖ్యమంత్రి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. ఖమ్మం ఆర్డీఓ నర్సింహారావు, ప్రిన్సిపాల్ విజయదుర్గ, డీసీఓ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

నేడు జిల్లాలో మంత్రి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం సత్తుపల్లిలోని వేంసూరు రోడ్డులో నూతన ఫంక్షన్ హాల్‌ను ప్రారంభిస్తారు. ఆతర్వాత మధ్యాహ్నం 12గంటలకు కూసుమంచి తహసీల్‌లో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశాక హైదరాబాద్ బయలుదేరతారు.

అందరి సమన్వయంతోనే నాణ్యమైన విద్య

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



విద్యార్థికి చెక్కు అందిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సంస్థల ప్రతినిధులు

ఖమ్మంసహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు తోడు తల్లిదండ్రులు సమన్వయంతో వ్యవహరిస్తే సౌకర్యాలు అందుబాటులోకి రావడమే కాక విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు సహకరిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎన్జీఓలను భాగస్వాములుగా చేయాలన్నారు. ఈమేరకు సమన్వయం చేసుకునే బాధ్యత సీఎంఓ యలగందుల రాజశేఖర్ స్వీకరించాలని ఆదేశించారు. అనంతరం హెల్పింగ్ హాండ్స్ సంస్థకు పురుషోత్తమరావు ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థినికి కలెక్టర్ చేతుల మీదుగా చెక్కు అందించారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, వివిధ సంస్థల ప్రతినిధులు బాబు, పసుమర్తి రంగారావు, డాక్టర్ కాపా మురళీకృష్ణ, సుధాకర్, పురుషోత్తమరావు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

బోనకల్: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే వారికి మర్యాదగా వ్యవహరిస్తూ మెరుగైన వైద్యం అందించడమే వైద్యులు, సిబ్బంది లక్ష్యం కావాలని డీఎంహెచ్ఓ బి.కళావతిబాయి సూచించారు. బోనకల్ పీహెచ్‌సీని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోజువారీ ఓపీ సేవలు, ఉద్యోగుల హాజరును తనిఖీ చేశారు. నిత్యం అందుబాటులో ఉంటూ వైద్యసేవలందించడమే కాక రికార్డులు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. పీడీఎంఓ డాక్టర్ కావ్య, ఉద్యోగులు ఉదయశ్రీ, రాధాలత తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు హెచ్‌ఎంలపై వేటు

- డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలనలో నిర్లక్ష్యం వహించారని చర్యలు
- అనర్హులుగా గుర్తిస్తూ ఇప్పటికే ఏడుగురు టీచర్ల తొలగింపు
- హెచ్‌ఎంల సస్పెన్షన్‌పై సంఘాల మండిపాటు



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న జీహెచ్‌ఎంల అసోసియేషన్ నాయకులు

ఖమ్మం సహకారనగర్: డీఎస్సీ–2024 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని తేలడంతో ఇద్దరు హెచ్‌ఎంలను సస్పెండ్ చేశారు. జిల్లా అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా పాఠశాల విద్యాశాఖ వరంగల్ ఆర్‌జేడీ కె.సత్యనారాయణరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను గత నెల 2నుంచి 5వ తేదీ వరకు పరిశీలించగా లాంగ్వేజ్ పండిట్ (ఎల్‌పీ) హిందీలో 19 పోస్టులకు 57మందిని పిలిచారు. అయితే, ఏడుగురికి అర్హత లేకున్నా ఉద్యోగాలకు ఎంపిక చేశారని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పలువురు ఫిర్యాదు చేయడంతో ఆయన విచారణ చేయించారు. ఈ మేరకు నోటిఫికేషన్‌లో పేర్కొన్నట్లుగా ఏడుగురికి విద్యార్హతలు లేవని గుర్తించి వారిని ఉద్యోగాలను తొలగించడమే కాక ఆ తర్వాత స్థానాల్లో ఉన్న వారికి గురువారం పోస్టింగ్ ఇచ్చారు.

బాధ్యులపై చర్యలు

సర్టిఫికెట్ల పరిశీలన సమయాన విధులు నిర్వర్తించిన హెచ్‌ఎంల కారణంగా అనర్హుల ఎంపిక జరిగిందనే విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో జిల్లా అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా ఇద్దరు గ్రేడ్–2 హెచ్‌ఎంలను సస్పెండ్ చేశారు. వీరిలో ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు, కొణిజర్ల మండలం గుబ్బగుర్తి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రంగారెడ్డి, శివనారాయణ ఉన్నారని డీఈఓ సోమశేఖరశర్మ శుక్రవారం తెలిపారు.

ఉపాధ్యాయ సంఘాల ఆగ్రహం

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన సమయాన అధికారులు పర్యవేక్షించకుండా ఇప్పుడు హెచ్‌ఎంలను బాధ్యులుగా చేశారని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటిఫికేషన్ ఆధారంగా మార్గదర్శకాలతో సర్టిఫికెట్ల పరిశీలన చేపడితే తప్పులు దొర్లే అవకాశం ఉండేది కాదన్నారు. ఈ విషయాన్ని పట్టించుకోని అధికారులు సర్టిఫికెట్లు ఒరిజినలా, కాదా అని మాత్రమే పరిశీలించిన హెచ్‌ఎంలపై చర్యలు తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈమేరకు సస్పెన్షన్ ఎత్తివేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రాజు భానుచంద్రప్రకాష్, ఆర్.రాజు గంగా రెడ్డి, కోశాధికారి బి.తుకారాంతో పాటు టీపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. అలాగే, హెచ్‌ఎంల అసో సియేషన్ ఆధ్వర్యాన డీఈఓకు వినతిపత్రం అందజేశారు.

క్లుప్తంగా

నేడు పీఆర్ చాంబర్ ఉమ్మడి రాష్ట్రాల సమావేశం

ఖమ్మంవన్‌టౌన్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్థాయి పంచాయతీరాజ్ చాంబర్ సమావేశం ఖమ్మంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు జరగనుందని తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ ఉపాధ్యక్షుడు లోడిగ వెంకన్నయాదవ్ తెలిపారు. ఖమ్మంలోని కోణార్క్ హోటల్‌లో జరిగే ఈ సమావేశంలో జాతీయ అధ్యక్షుడు యలమంచిలి బాబూ రాజేంద్రప్రసాద్, తెలంగాణ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి, గౌరవ అధ్యక్షుడు పుసులూరి నరేందర్ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈమేరకు రెండు రాష్ట్రాల స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

మిర్చి తోటలు పరిశీలన



మిర్చితోటలో పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఖమ్మంరూరల్: మండలంలోని తెల్దారుపల్లిలో మిర్చి తోటలను వైరా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ ఆధ్వర్యాన శాస్త్రవేత్తలు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొమ్మకుళ్లు తెగులు ఆశించిందని గుర్తించిన వారు తెగులు లక్షణాలు, సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు.

మాలధారులకు మైనార్టీ నేత అన్నప్రసాద వితరణ



గౌసుద్దీన్‌ను సన్మానిస్తున్న అయ్యప్ప మాలధారులు

కారేపల్లి: మతాలు వేరైనా దేవుడు ఒక్కడేనని కారేపల్లి జామే మసీదు మాజీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ మైనార్టీ సెల్ నాయకుడు షేక్ గౌసుద్దీన్ అన్నారు. కారేపల్లిలోని శ్రీగంగమ్మతల్లి ఆలయ సమీపాన సింగరేణి కమూనిటీ హాల్‌లో అయ్యప్పస్వామి మాలధారులకు నిత్యాన్నదానం ఏర్పాటుచేస్తుండగా గౌసుద్దీన్ శుక్రవారం రెండు క్వింటాళ్ల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన కులమతాలకతీతంగా అంతా కలిసి ఉండాలని తెలిపారు. ఈమేరకు గౌసుద్దీన్‌ను మాలధారులు సన్మానించారు. గురుస్వాములు పాలిక సారయ్య, కేతిమాల శ్రీను, సంగు సాయి, తాటికాయల శ్రీను, పాలిక శ్రీనుతో పాటు రామసాని వాసు, కొండపల్లి ప్రదీప్, నాగరాజు, పాలిక రమేష్, జె.శ్రీనివాసరావు, దంతాల వెంకట్, కట్టా రమేష్, బి.సతీష్, పరశురాం, పి.ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆళ్వార్ల ప్రవచనాలు ప్రారంభం



మాట్లాడుతున్న కోదండరామాచార్యులు, పక్కన పండితులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం బైపాస్ రోడ్డులోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో ద్వాదశసూరుల(ఆళ్వార్లు) వైభవ ప్రవచనాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. వేదావధాని, పాంచరాత్రాగమ శాస్త్ర విద్వన్మణి డాక్టర్ కండ్లకుంట కోదండరామాచార్యులు, శ్రీ వైష్ణవ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేదాంతం రాఘవాచార్యుల దంపతులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కోదండరామాచార్యులు ప్రవచనాల ప్రాముఖ్యతను వివరించారు. రాష్ట్రంలోనే 12 మందితో ప్రవచనాలు నిర్వహించడం ఇదే మొదటిసారని తెలిపారు. అనంతరం వివిధ అంశాలపై హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ ఎం.లక్ష్మణాచార్యులు, విజయవాడకు చెందిన ఎం.తిరుమలిశై ఆళ్వార్, నెల్లూరుకు చెందిన కె.లక్ష్మీనారాయణ వివరించారు. ఖమ్మం, వరంగల్, హైదరాబాద్‌కు చెందిన భక్తులు పాల్గొన్నారు.


రోడ్డుపై వ్యర్థాలు చేసిన వ్యాపారికి జరిమానా



వ్యాపారికి రశీదు ఇస్తున్న కేఎంసీ సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం 45వ డివిజన్‌లో రోడ్డుపై వ్యర్థాలు వేసిన ఓ వస్త్ర దుకాణ యాజమానికి కేఎంసీ సిబ్బంది జరిమానా విధించారు. సదరు వ్యాపారి నుంచి శుక్రవారం రూ.2 వేల జరిమానా వసూలు చేశారు. షాపుల్లో వెలువడే చెత్తను కేఎంసీ వాహనాలకు ఇవ్వాలే తప్ప రహదారులు, కూడళ్లు, డ్రెయినేజీల్లో వేస్తే జరిమానా విధిస్తామని అధికారులు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,144

యాసంగికి విత్తనాలు సిద్ధం

- అందుబాటులోకి తీసుకొచ్చిన తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ
- మూడు రకాల వరితో పాటుపెసర, మినుము, శనగ, వేరుశనగ విత్తనాలు కూడా..
- పీఏసీఎస్‌లు, రైతుసేవా కేంద్రాల ద్వారా విక్రయానికి ఏర్పాట్లు



విత్తనాభివృద్ధి సంస్థ గోదాంలో నిల్వ చేసిన వరి విత్తనాల బ్యాగ్‌లు

ఖమ్మంవ్యవసాయం: ఈ ఏడాది భారీ వర్షాలతో జలాశయాల్లో సమృద్ధిగా నీరు చేరింది. దీంతో ఖరీఫ్ సీజన్ చివరి దశకు చేరగా.. రైతులు యాసంగి పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. ఈనేపథ్యాన డిమాండ్‌కు అనుగుణంగా అవసరమైన విత్తనాలను అందుబాటులోకి తీసుకురావడంపై తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ దృష్టి సారించింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో యాసంగిలో సాగు చేయనున్న పంటలు, నేలల రకాలు, నీటి వనరుల ఆధారంగా విత్తనాలు సిద్ధం చేస్తున్నారు. రెండు జిల్లాల్లో ప్రధానంగా వరితో పాటు అపరాల పంటలైన పెసర, మినుము, శనగ, వేరుశనగ వంటి పంటలను సాగు చేసే అవకాశముంది. విత్తనాలను ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, ఆగ్రో రైతు సేవా కేంద్రాలు, డీలర్ల ద్వారా విక్రయించాలని నిర్ణయించారు.

వరిలో సన్నరకాలకే ప్రాధాన్యత

యాసంగి సీజన్‌కు అనుకూలమైన మూడు రకాల వరి విత్తనాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎప్పుడైనా యాసంగిలో తక్కువ కాలం పంటలే సాగుచేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న రకాల ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్‌గా ప్రకటించింది. దీంతో రైతులు సన్న రకాల సాగుకే ప్రాధాన్యత ఇస్తారని తెలుస్తోంది. ఈ మేరకు తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ఖమ్మం యూనిట్‌లో ఎంటీయూ-1010, కేఎన్ఎం-1638, ఆర్ఎన్ఆర్-15048 రకాలు సిద్ధం చేశారు. అంతేకాక జలాశయాల్లో సమృద్ధిగా నీరు ఉండటంతో ఉమ్మడి జిల్లా రైతాంగం బీపీటీ 5204(సాంబమసూరి), హెచ్ఎంటీ, జగిత్యాల సాంబ, వరంగల్ రకాలపైనా దృష్టి సారించినట్లు చెబుతున్నారు. ఫలితంగా ఈ రకాల విత్తనాలను కూడా జగిత్యాల, వనపర్తి, వరంగల్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల నుంచి తెప్పించడంపై అధికారులు దృష్టి సారించారు.

అపరాలు, నూనె గింజలు..

యాసంగి సీజన్‌లో సాగు చేయనున్న అపరాల పంటలైన పెసర, మినుము, వేరుశనగ విత్తనాలను సైతం విత్తనాభివృద్ధి సంస్థ సిద్ధం చేస్తోంది. పెసరలో ఎంజీజీ-295, ఎంజీజీ-385, రకాలు మినుములో పీయూ-31, జీబీజీ-1, మంచి శనగలో జాకీ-9218, ఎన్‌బీఈజీ-49 రకాలు అందుబాటులోకి తీసుకురాగా, వేరుశనగలో గిరినార్-5, లేపాక్షి-కేఎల్-1812 రకాలు అందుబాటులోకి తీసుకొచ్చారు.

సబ్సిడీ లేకుండానే...

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో సాగుకు అనుగుణంగా విత్తనాలను సమకూరుస్తున్న విత్తనాభివృద్ధి సంస్థ వీటిని పీఏసీఎస్‌లు, ఆగ్రో రైతు సేవా కేంద్రాల్లో విక్రయించనుంది. ఉమ్మడి జిల్లాలోని 100 సహకార సంఘాల్లో యాసంగి విత్తనాలను అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. అయితే, విత్తనాలపై సబ్సిడీ మాత్రం ప్రకటించలేదు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఉమ్మడి జిల్లాలో యాసంగి పంటల సాగు అంచనాల మేరకు విత్తనాలు సమకూరుస్తున్నాం. విత్తనాలకు ఎలాంటి కొరత ఉండదు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సామర్థ్యానికి మించి అవసరమైనా తెప్పిస్తాం. వరి, అపరాల పంటలైన పెసర, మినుము, వేరుశనగ తదితర పంటల విత్తనాలను ఇప్పటికే సిద్ధం చేశాం.

– ఎస్.బిక్షం, రీజినల్ మేనేజర్, విత్తనాభివృద్ధి సంస్థ ఖమ్మం యూనిట్

విత్తన రకాలు, ధరల వివరాలు

పంట	రకం	విత్తన లభ్యత (క్వింటాళ్లలో)	సంచి పరిమాణం (కిలోలు)	సంచి ధర (రూ.ల్లో)
పెసర	ఎంజీజీ-295	34.88	4	478.92
పెసర	ఎంజీజీ-385	23.52	4	478.92
మినుము	పీయూ-31	20.52	4	518.24
మినుము	జీబీజీ-1	13.36	4	518.24
శనగ	ఎన్‌బీఈజీ-49	00.25	25	2,250.00
శనగ	జాకీ-9218	00.25	25	2,250.00
వేరుశనగ	గిరినార్-5	79.50	30	3,046.50
వేరుశనగ	లేపాక్షి-1812	00.50	30	3,046.50
వరి	ఎంటీయూ-1010	66.50	25	995.00
వరి	కేఎన్ఎం-1638	85.75	25	1,005.00
వరి	ఆర్ఎన్ఆర్-15048	15.75	25	1,094.00

ఖమ్మం చేరిన మహారాష్ట్ర వాసుల సైకిల్ యాత్ర



యాత్రికులకు స్వాగతం పలికిన శ్రీనివాసరావు

ఖమ్మంఅర్బన్: మహారాష్ట్రకు చెందిన ఇద్దరు వృద్ధులు ఒడిశాలోని పూరి వరకు చేపట్టిన సైకిల్ యాత్ర శుక్రవారం ఖమ్మం చేరుకుంది. షోలాపూర్‌కు చెందిన 65ఏళ్ల శైలనొచే, 79ఏళ్ల విఠల్ ఖదమ్ యాత్ర చేపడుతుండగా ఖమ్మంలో వారికి అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు స్వాగతం పలికి అభినందించారు. గతంలో షోలాపూర్ నుండి కన్యాకుమారి, హరిద్వార్, కేదారినాథ్, జమ్మూ వరకు తాము సైకిల్ యాత్ర చేశామని శైలనొచే, విఠల్ తెలిపారు.

రెస్టారెంట్‌లో తనిఖీ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం బైపాస్ రోడ్డులోని ఓ రెస్టారెంట్‌లో బిర్యానీ తిన్న వారికి శరీరంపై దద్దుర్లు వచ్చాయని తెలియడంతో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. బిర్యానీ తినడంతో అనారోగ్యానికి గురైనట్లు సదరు వ్యక్తి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా తనిఖీ చేపట్టారు. ఈమేరకు రెస్టారెంట్‌లోని కిచెన్, అక్కడి ఆహార పదార్థాలను తనిఖీ చేయడంతో పాటు పరీక్షల నిమిత్తం బిర్యానీ శాంపిళ్లను సేకరించారు.

రైతులకు సులభంగా విద్యుత్ సేవలు

ఇకపై తెలుగులో అంచనా పత్రాలు

ఖమ్మంవ్యవసాయం: రైతులకు విద్యుత్ సంబంధిత సేవలను మరింత చేరువ చేసేలా ఎన్పీడీసీఎల్ నిర్ణయం తీసుకుంది. నూతన విద్యుత్ లైన్లు, సర్వీసులకు సంబంధించి ఇన్నాళ్ల అంచనా పత్రాలను ఇంగ్లిష్‌లో ముద్రిస్తున్నారు. తద్వారా రైతులు ఇబ్బంది పడుతుండడం.. ఇటీవల నిజామాబాద్‌లో నిర్వహించిన ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(ఈఆర్సీ) సమావేశంలో పలువురు ఈ విషయాన్ని ప్రస్తావించారు. దీంతో రైతులకు సౌకర్యవంతంగా అంచనా పత్రాలు ఉండేలా ఈఆర్సీ సూచనలు మేరకు అన్ని అంచనా పత్రాలను తెలుగులో ముద్రణకు నిర్ణయించారు. ఈ వివరాలను ఖమ్మం ఎస్ఈ ఏ.సురేందర్ వెల్లడించారు. రైతులకు అవసరమైన పత్రాలను తెలుగులోకి అందుబాటులోకి తీసుకురావడమేకాక పొలంబాట కార్యక్రమాన్ని విస్తృతం చేస్తామని తెలిపారు. విద్యుత్ మోటర్లకు కెపాసిటర్ల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తూ, ట్రాన్స్‌ఫార్మర్లను నిర్ణీత ఎత్తులో ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.

హైవే నిర్మాణంలో ప్లాట్లు కోల్పోనున్న 300మంది?

రఘునాథపాలెం: నాగపూర్-అమరావతి నేషనల్ హైవే నిర్మాణానికి ఖమ్మం బల్లేపల్లి వద్ద సర్వేనంబర్ 218 మీదుగా అలైన్‌మెంట్ రూపొందించగా గతంలో ప్రభుత్వం కేటాయించిన 300 ప్లాట్లను పేదలు కోల్పోనున్నట్లు సమాచారం. అధికారులు ఇటీవల చేపట్టిన సర్వేలో ప్రాథమికంగా గుర్తించారని తెలిసింది. 2009లో పేదలకు అప్పటి ప్రభుత్వం స్థలాలు కేటాయించగా వసతుల లేమితో ఇళ్లు నిర్మించుకోలేదు. ఇంతలోనే హైవే నిర్మాణానికి మార్కింగ్ చేయగా యజమానులు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. దీంతో మూడు రోజులు పాటు రెవెన్యూ అధికారులు సర్వే చేయగా 700 మందిలో 300మంది ప్లాట్లు హైవే నిర్మాణంలో కోల్పోనున్నట్లు నిర్ధారించినట్లు తెలిసింది.

కూలీలపై తేనెటీగల దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కూలీలు

పెనుబల్లి: మండలంలోని మండాలపాడులో శుక్రవారం వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన కూలీలపై తేనెటీగలు దాడిచేశాయి. గ్రామానికి చెందిన మహిళలు పత్తి తీస్తుండగా తేనెటీగలు దాడి చేయడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. వీరికి పెనుబల్లి, సత్తుపల్లి ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు.

నేడే న్యాయ సేవల దినోత్సవం

ఖమ్మం లీగల్: జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ అమల్లోకి వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని 1995 నుంచి ఏటా నవంబర్ 9న న్యాయ సేవల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం న్యాయ సేవా సంస్థ సంస్థ భవనంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.కల్పన అధ్యక్షతన అవగాహన సదస్సు జరగనుంది.

పోలీసుల అదుపులో ఏటీఎం ట్యాంపరింగ్ ముఠా?

ఖమ్మంక్రైం: ఖమ్మం ఎన్ఎస్‌టీ రోడ్డులోని ఓ బ్యాంకు ఏటీఎంను ట్యాంపర్ చేస్తూ నగదును తమ ఖాతాల్లోకి బదలాయిస్తున్న ముఠా సభ్యురాలిని ఖమ్మం టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ ఏటీఎం నుంచి తరచుగా ఇతర ఖాతాల్లోకి భారీగా నగదు బదిలీ అవుతోందని బ్యాంకు ప్రధాన కార్యాలయం నుంచి ఇక్కడకు సమాచారం అందింది. దీంతో బ్రాంచ్ అధికారులు పోలీసుల సాయంతో నిఘా పెట్టినట్లు తెలిసింది. ఈమేరకు బిహార్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ ఏటీఎం వద్దకు వచ్చి ట్యాంపర్ చేసే ప్రయత్నాల్లో ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే, మరో ముగ్గురు పారిపోగా వీరి కోసం పోలీసులు గాలిస్తున్నారని తెలిసింది. ఈ ముఠా పలుచోట్ల ఏటీఎంలను ట్యాంపర్ నుంచి రూ.లక్షల్లో నగదును తమ ఖాతాలకు మళ్లించుకున్నట్లు సమాచారం.

బ్రెయిన్ స్ట్రోక్‌తో కానిస్టేబుల్ మృతి



పార్థసారధి (ఫైల్)

వైరా/ఖమ్మం క్రైం: ఖమ్మంలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న జాలాది పార్థసారధి(40) బ్రెయిన్ స్ట్రోక్‌తో శుక్రవారం మృతి చెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. వైరా, కొణిజర్ల, తల్లాడ, ఖమ్మంలో జయప్రకాష్ విధులు నిర్వర్తించిన ఆయన ఖమ్మం అల్లీపురం క్రాస్‌లో నివాసముంటున్నారు. కొన్నాళ్లుగా కిడ్నీల సమస్యతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న పార్థసారధికి అక్కడే బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో మృతి చెందాడు. జయప్రకాష్ మృతదేహం వద్ద పోలీసు అధికారులు, సిబ్బంది నివాళులర్పించగా, ఆయన స్వగ్రామమైన వైరా మండల రెబ్బవరంలో శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు

కొణిజర్ల: రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. వైరా వైపు నుంచి ఖమ్మం వెళ్తున్న ద్విచక్రవాహనదారుడు, ఖమ్మం నుంచి ఏన్కూరు వెళ్తున్న మరో వాహనదారుడు శుక్రవారం ఎదురెదురుగా ఢీకొన్నారు. దీంతో ఏన్కూరుకు చెందిన ధరావత్ ధనుష్‌కుమార్, ఖమ్మంకు చెందిన షేక్ నసీర్ గాయపడడంతో 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

ఆటోను ఢీకొట్టిన కారు

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం వెళ్తున్న ఆటోను వెనక నుండి వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఖమ్మం నుండి సూర్యాపేట వైపు వెళ్తున్న ఆటో పల్టీ కొట్టగా వాహనం నడుపుతున్న కందుకూరి నర్సింహ(24)కు తీవ్ర గాయాలయ్యాయి. అయితే, కారు డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోగా నర్సింహను హైవే పెట్రోలింగ్ సిబ్బంది ఖమ్మం తరలించారు.

లారీడ్రైవర్‌కు జైలు శిక్ష

కొత్తగూడెంటౌన్: అతి వేగంగా, అజాగ్రత్తగా లారీని నడిపి ముగ్గురు వ్యక్తుల మరణానికి కారణమైన లారీ డ్రైవర్ బాదావత్ కోటేశ్వరరావుకు రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.5 వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ తీర్పు చెప్పారు. 2019, జనవరి 31న ఖమ్మం జిల్లా రఘునాథపాలెంనకు చెందిన బాదావత్ కోటేశ్వరరావు.. లారీని అజాగ్రత్తగా, అతివేగంగా నడుపుతూ అశ్వాపురం పీఎస్ పరిధిలోని మొండికుంట సమీపంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న పశ్చిమ గోదావరి జిల్లా ఉంగుటూరు గ్రామం కొత్తగూడెంనకు చెందిన రాయిపాసి రాజుల, పులిచర్ల సత్యనారాయణ, మేకల వెంకటరావును ఢీకొట్టాడు. దీంతో ఆ ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. అదే రోజు అశ్వాపురం పీఎస్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు తర్వాత కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. న్యాయమూర్తి 8 మంది సాక్షులను విచారించి, లారీడ్రైవర్ బాదావత్ కోటేశ్వరరావుపై నేరం రుజువు కావడంతో రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి పాటిల్ వసంత్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీడీ లక్ష్మి వ్యవహరించారు.

రెండు లారీలు ఢీ.. డ్రైవర్ మృతి



ఘటనలో ధ్వంసమైన లారీ క్యాబిన్

తిరుమలాయపాలెం: మండలంలోని దమ్మాయిగూడెం స్టేజీ వద్ద శుక్రవారం తెల్లవారుజామున రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ లారీ డ్రైవర్ మృతి చెందగా మరో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. రామగుండం నుండి ఫ్లైయాష్ లోడ్‌తో ఖమ్మం వెళ్తున్న లారీ తెనాలి నుంచి పూణేకునిమ్మకాయల లారీ దమ్మాయిగూడెం వద్ద ఢీకొన్నాయి. రెండు లారీల క్యాబిన్లు పూర్తిగా ధ్వంసం కావడంతో ఫ్లైయాష్ లారీలోని కరీంనగర్ హుస్నేనీపురకు చెందిన డ్రైవర్ మహ్మద్ మోసిన్(41)ను ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మరో లారీలోని తెనాలి పాండురంగపేటకు చెందిన డ్రైవర్ కాకర్ల వెంకటకోటయ్యకు తీవ్రగాయాలయ్యాయి. డ్రైవర్లు నిద్రమత్తులో ఉండడంతోనే ఈ ప్రమాదం జరిగిందని తెలుస్తోంది. ఘటనపై తిరుమలాయపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా సీఎం పుట్టినరోజు వేడుకలు



సత్తుపల్లి : ఎమ్మెల్యే రాగమయికి కేక్ తినిపిస్తున్న దయానంద్



వైరా : కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్

సత్తుపల్లి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం సత్తుపల్లిలోని సిద్దారం రోడ్డు నుంచి జేవీఆర్ డిగ్రీ కళాశాల వరకు ఆటోలు, మోటారుసైకిళ్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాల ఆవరణలో 54 కేజీల కేక్‌ను ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి - దయానంద్ కట్ చేయగా, నిర్మలసాయిశ్రీ గీసిన రేవంత్‌రెడ్డి 54 చిత్రాలను ప్రదర్శించారు. అతర్వాత ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన అంతరాష్ట్ర క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనల మేరకు విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తామని, సత్తుపల్లిలో ఇండోర్, ఔట్‌డోర్ స్టేడియంలతో పాటు ఎస్‌బీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతన భవనాలు నిర్మిస్తామన్నారు. ఈక్రమాన ఆమె ఆటో నడిపి ఆకట్టుకున్నారు. నాయకులు, ప్రజాప్రతినిధులు చల్లగుళ్ల నర్సింహారావు, శివ వేణు, ఉడతనేని అప్పారావు, తోట సుజలరాణి, దోమా ఆనంద్, ఎం.డీ.కమల్ పాషా, గాదె చెన్నారావు, మౌలాలీ, పద్మజ్యోతిరెడ్డి, సుబ్బారెడ్డి, తుంబూరు కృష్ణారెడ్డి, చల్లారి వెంకటేశ్వరరావు, సందీప్‌గౌడ్ పాల్గొన్నారు.

వైరా: సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ కేక్ కట్ చేసి మాట్లాడారు. మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్‌తో పాటు శీలం వెంకటనర్సిరెడ్డి, దాసరి దానియేలు, సూరంపల్లి రామారావు, దొడ్డా పుల్లయ్య, పమ్మి అశోక్, పణితి సైదులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మంత్రి



సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా యాదగిరిగుట్టలో ఆయనను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, మంత్రి తనయుడు యుగంధర్ సీఎంను హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రైతులారా.. జాగ్రత్తలు వహించండి

- పత్తిలో పొగాకు లద్దెపురుగు
- కంది, పెసర, మినుములోనూ తెగుళ్లు
- సస్యరక్షణ చర్యలపై మధిర శాస్త్రవేత్తల సూచనలు



మినుము పైరులో పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మధిర: ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో పత్తి దిగుబడిపై ప్రభావం పడుతోంది. ఇంతలోనే పత్తి పంటను పొగాకు లద్దె పురుగు ఆశిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఈ నేపథ్యాన మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా జిలుగుమాడు, సిరిపురం తదితర గ్రామాల్లో పంటలను పరిశీలించగా తెగుళ్లు ఆశించినట్లు నిర్ధారించారు. ఈ మేరకు సస్యరక్షణ చర్యలపై పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.రుక్మిణిదేవి, శాస్త్రవేత్తలు డాక్టర్ టి.భరత్, నాగస్వాతి రైతులకు ఇచ్చిన సలహాలు ఇలా ఉన్నాయి.

- **పత్తి** : పత్తి తీత మొదలైన సమయాన పొగాకు లద్దె పురుగు ఉధృతి ఉందని గుర్తించారు. ఈ పురుగు నివారణకు తొలుత గుడ్లు తొలగించడం, తర్వాత పురుగు దశ ఆధారంగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. చిన్నపిల్ల పురుగుల నివారణకు క్లోరిపైరిఫాస్ 500 మి.లీ. లేదా నోవాల్యూరాన్ 100 మి.లీ. లేదా థయోడికార్బ్ 100 గ్రాములను ఎకరానికి పిచికారీ చేసుకోవాలి. లద్దె పురుగు పెద్దదిగా మారితే ఏ మందు పనిచేయదని గుర్తించాలని తెలిపారు. ఈమేరకు ఐదు కిలోల తవుడు, అరకిలో బెల్లం, 500 మి.లీ. క్లోరిపైరిఫాస్‌ను సరిపడా నీటితో కలిపి చేసిన విషపు ఎరలను సాయంత్రం వేళ సాళ్లలో లేదా మొక్క మొదళ్లలో వేసుకోవాలని సూచించారు.
- **కంది** : కంది పంట మొగ్గ దశ నుంచి పూత దశలో ఉంది. ఈ దశలో మారుకా మచ్చల పురుగు ఆశించే అవకాశమున్నందున వేప నూనె లీటర్, క్లోరిపైరిఫాస్ 500 మి.లీ.ను ఎకరానికి సరిపడా నీటితో కలిపి పిచికారీ చేయాలని శాస్త్రవేత్తలు సూచించారు. ఉధృతి ఎక్కువైతే నోవాల్యూరాన్ 100 మి.లీ. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 60 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 40 మి.లీ.ను ఎకరానికి పిచికారీ చేసుకోవాలని తెలిపారు.
- **పెసర, మినుము** : మారుకా మచ్చల పురుగు కందినే కాకుండా పెసర, మినుమును ఆశిస్తుంది. ఈ తోటల్లో ఇప్పటికే తామర పురుగులు, పొగాకు లద్దె పురుగులను గుర్తించారు. వీటి నివారణకు ఫిప్రోనిల్ 300 మి.లీ. లేదా డైమిథోయేట్ 400 మి.లీ. లేదా స్పైనోశాడ్ 60 మి.లీ.ను ఎకరానికి పిచికారి చేసుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు.

చిరుత సంచారం?

మధిర: మధిర మండలంలోని వంగవీడు శ్మశాన వాటిక సమీపంలో శుక్రవారం చిరుత సంచరించినట్లుగా ఓ వ్యక్తి తీసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఓ రైతు వీడియో తీసినట్లు తెలుస్తుండగా అందులో చిరుత మాత్రం స్పష్టంగా కనిపించడంలేదు. ఈమేరకు సమాచారం అందుకున్న మధిర డివిజన్ అటవీశాఖ రేంజ్ అధికారి శ్రీనివాసరెడ్డి ఘటనాస్థలికి వెళ్లి పాదముద్రలను పరిశీలించారు. అయితే, ఇవి చిరుత పాదముద్రలు కాదని, అటవీ జంతువు అయి ఉంటుందని వెల్లడించిన ఆయన శనివారం మరోమారు పరిశీలించి నిర్ధారిస్తామని తెలిపారు.

ముద్దునూరులో పల్లె ప్రకృతివనం ధ్వంసం

తల్లాడ: మండలంలోని ముద్దునూరులో పల్లె ప్రకృతివనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. 2021లో ఏర్పాటు చేసిన వనం గేట్, ఇనుప కంచె, నేమ్‌బోర్డుతో పాటు మొక్కలను దుండగులు గురువారం రాత్రి ధ్వంసం చేశారు. ఈవిషయమై శుక్రవారం గ్రామకార్యదర్శి ఈ.యాకలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, పల్లె ప్రకృతివనాన్ని కొందరు ఆక్రమించుకున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేయగా కల్లూరు ఆర్డీఓ విచారణ చేపట్టారు. ఇంతలోనే ఈ ఘటన జరగడం గమనార్హం.

డీజీపీని కలిసిన ఈడీ అధికారులు

సాక్షి, హైదరాబాద్: డీజీపీ జితేందర్‌ను శుక్రవారం సాయంత్రం కొందరు ఈడీ అధికారులు కలిసినట్టు సమాచారం. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలోని భూదాన్ భూముల కుంభకోణానికి సంబంధించి ఇప్పటికే ఐఏఎస్ అధికారి, రంగారెడ్డిజిల్లా మాజీ కలెక్టర్ అమోయ్‌కుమార్‌ను ఈడీ అధికారులు గత నెలలో 3 రోజులపాటు ప్రశ్నించిన విషయం తెలిసిందే. అంతకుముందు మహేశ్వరం తహసీల్దార్ జ్యోతి స్టేట్‌మెంట్లను ఈడీ అధికారులు నమోదు చేశారు. ఈ ఇద్దరు అధి కారుల విచారణ సందర్భంగా సేకరించిన సమాచారం ఆధారంగా మాజీ ఆర్డీఓ వెంకటా చారినీ ఈడీ అధికారులు రెండు రోజుల క్రితం సుదీ ర్ఘంగా ప్రశ్నించారు. ఈ కేసులో కీలక సమాచా రం సేకరిస్తున్న నేపథ్యంలో ఈడీ అధికారులు డీజీపీని కలవడం ప్రాధా న్యం సంతరించుకుంది. అమోయ్‌కుమార్‌పై వచ్చిన ఆరోపణలపై డీజీపీని కలిసి ఈడీ అధికారులు చర్చించారు. మనీ లాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేసేందుకు స్థానిక పోలీసుల సహకారం కావాలని డీజీపీని ఈడీ అధికారులు కోరారు. భూదాన్ భూముల వ్యవహారంలో పోలీసులకు లేఖ రాసినా, ఇప్పటి వరకు ఎలాంటి వివరాలివ్వ లేదని డీజీపీకి ఈడీ అధికారులు తెలిపా రు. శంకరాహిల్స్ సొసైటీ, బాలసాయిబాబా ట్రస్ట్ భూములు, రాయదుర్గంలోని కొన్ని భూముల వ్యవహారంలో ఇన్వెస్టిగేషన్ జరిపించాలని డీజీపీని ఈడీ అధికారులు కోరినట్టు సమాచారం.

ఖాకీలపై ఆగ్రహం..

సోషల్ మీడియా యాక్టివిస్టుల అరెస్టులపై ఏపీ హైకోర్టు ఆదేశం

ఈనెల 4 నుంచి సంబంధిత పోలీస్ స్టేషన్లలోని సీసీ ఫుటేజీని స్థానిక మెజిస్ట్రేట్లకు సీల్డ్ కవర్లలో అందజేయండి

సాక్షి అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా కొద్ది రోజులుగా యథేచ్ఛగా జరుగుతున్న సోషల్ మీడియా కార్యకర్తల అరెస్టులు, అక్రమ నిర్బంధాలపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. అక్రమ నిర్బంధాల విషయంలో పోలీసుల తీరుపై పలు సందేహాలు వ్యక్తం చేసింది. ఇద్దరు సోషల్ మీడియా కార్యకర్తల అక్ర మ నిర్బంధానికి సంబంధించి రెండు పోలీస్ స్టేష న్లలో సీసీ టీవీ ఫుటేజీలను సంబంధిత మేజిస్ట్రేట్ల ఎదుట సీల్డ్ కవర్లలో అందచేయాలని పోలీసులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. వ్యక్తుల అరెస్ట్ విష యంలో చట్ట నిబంధనలు పాటించి తీరాల్సిందేనని పోలీసులకు తేల్చి చెప్పింది. లేని పక్షంలో తాము జోక్యం చేసుకో వాల్సి ఉంటుందని, ఆ పరిస్థితి తేవద్దని హెచ్చరించింది. ఇది వ్యక్తుల స్వేచ్ఛతో ముడి పడి ఉందని, కాబట్టి ఈ విషయాన్ని తేలికగా తీసుకోవద్దని తేల్చి చెప్పింది. చట్ట నిబంధనలు పాటించేలా పోలీసులను చైతన్య పరచాలని రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది. విశాఖకు చెందిన సోషల్ మీడియా కార్యకర్త తిరుపతి లోకేష్‌ను సోమవారం తమ ముందు హాజరు పరచాలని పోలీసులను ఆదేశించింది. వ్యక్తులను పోలీసులు అక్రమంగా నిర్బంధించారంటూ హైకోర్టులో పిటిషన్లు దాఖలు కావడం ఎక్కువ అయిందని ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. దీనిపై తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేస్తూ న్యాయమూర్తులు జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావు ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

కోర్టును ఆశ్రయించిన బాధిత కుటుంబాలు

టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని సోషల్ మీడియాలో విమర్శిస్తున్నారంటూ పలువురిని పోలీసులు అక్రమంగా నిర్బంధంలోకి తీసుకుంటున్న విషయం తెలిసిందే. గత వారం రోజుల్లో 101 మందిని అక్రమంగా అరెస్టులు చేశారు. తమవారిని పోలీసులు కోర్టు ముందు హాజరు పర్చకుండా అక్రమ నిర్బంధంలో ఉంచడంపై బాధిత కుటుంబాలకు చెందిన పలువురు హైకోర్టును ఆశ్రయించారు. అక్రమంగా నిర్బంధించిన తమ కుటుంబ సభ్యులను న్యాయస్థానం ఎదుట హాజరు పరిచేలా ఆదేశించాలంటూ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై జస్టిస్ రఘునందన్‌రావు ధర్మాసనం తాజాగా విచారణ జరిపింది.

పౌరుల స్వేచ్ఛను కాపాడతాం..

విచారణ సందర్భంగా తిరుపతి లోకేష్ తరపు న్యాయవాది చింతల సుమన్ వాదనలు వినిపిస్తూ.. వైఎస్సార్ కుటుంబం పేరుతో వాట్సాప్ గ్రూప్‌లో ఉన్న 411 మందికి నోటీసులు ఇచ్చారని నివేదించారు. వారిలో 120 మంది విజయవాడ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో హాజరయ్యారని తెలిపారు. తిరుపతి లోకేష్‌ను సైబర్ క్రైమ్ పోలీసులు ఈ నెల 5న విశాఖ నుంచి విజయవాడ తరలించారన్నారు. లోకేష్ సోదరుడిని పిలిపించి తెల్ల కాగి తాలపై సంతకాలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని ధర్మాసనానికి నివేదించారు. ప్రస్తుతం లోకేష్ జాడ తెలియడం లేదన్నారు. ఈ సమయంలో కోర్టులో ఉన్న విజయవాడ సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ జానకి రామయ్యతో ధర్మాసనం నేరుగా మాట్లాడింది. తిరుపతి లోకేష్ సోషల్ మీడియా ద్వారా ఓ గ్రూప్ నిర్వహిస్తూ అసభ్యకర పోస్టులు పెడుతున్నారని ఆయన కోర్టుకు చెప్పారు. దీనిపై ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశామన్నారు. ఫోన్ చేయడంతో తన బావతో కలిసి లోకేష్ పోలీస్ స్టేషన్‌కు వచ్చారన్నారు. లోకేష్‌ని విచారించిన అనంతరం నోటీసులు ఇచ్చి పంపామన్నారు. నేరానికి సంబంధించిన ఎలక్ట్రానిక్ పరికరాలతో ఈ నెల 10న హాజరు కావాలని ఆయనకు సూచించినట్లు చెప్పారు. జానకి రామయ్య చెప్పిన వివరాలను రికార్డు చేసిన ధర్మాసనం.. సోమవారం ఉదయం 10:30 గంటలకు లోకేష్‌ను తమ ముందు హాజరుపరచాలని పోలీసులను ఆదేశించింది. ఈ నెల 4వతేదీ నుంచి 8వ తేదీ వరకు సీసీ టీవీ ఫుటేజీని భద్రపరచి సీల్డ్ కవర్‌లో విజయవాడ మెజిస్ట్రేట్‌కు సమర్పించాలని ఆదేశించింది. అరెస్ట్ చేసిన 24 గంటలలోపు నిందితులను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచాలని స్పష్టం చేసింది. చట్ట నిబంధనలను పాటించి తీరాలని లేదంటే తమ జోక్యం తప్పదని తేల్చిచెప్పింది. పౌరుల స్వేచ్ఛను కాపాడటం ఈ కోర్టు బాధ్యత అని స్పష్టం చేసింది. అంతకు ముందు పోలీసుల తరపున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు విని పిస్తూ సోషల్ మీడియా ద్వారా కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం, అసభ్య వ్యాఖ్యలు చేస్తున్నారని నివేదించారు. ఇలాంటి వారికి నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొనగా, దీనిపై ధర్మాసనం స్పందిస్తూ చట్ట నిబంధనలను పాటించాల్సిందేనని స్పష్టం చేసింది.

టేకులపల్లి స్టేషన్ ఫుటేజీ కూడా..

అనంతపురం జిల్లా ముదిగుబ్బ మండలం ఆత్మకూరుకు చెందిన జింకల నాగరాజు అక్రమ నిర్బంధంపై దాఖలైన పిటిషన్లపై విచారణను హైకోర్టు సోమవారానికి వాయిదా వేసింది. పూర్తి వివరా లతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. టేకులపల్లి స్టేషన్‌లోని సీసీ టీవీ ఫుటేజీని భద్రపరచి సంబంధిత మేజిస్ట్రేట్ ముందు ఉంచాలని పోలీసులను ఆదేశించింది.

సోషల్ మీడియా యాక్టివిస్టులకు అండగా నిలుస్తా

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ప్రజాస్వామ్య సూత్రాలను, మానవహక్కులను కాలరాసి మరీ సోషల్ మీడియా యాక్టివిస్టులను భయకంపితులను చేస్తున్న, దారుణంగా హింసిస్తున్న అత్యంత క్రూరమైన ప్రభుత్వంతో పోరాడుతున్నామని, ఈ యుద్ధంలో కచ్చితంగా న్యాయమే గెలుస్తుందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. 'ఈ అనైతిక యుద్ధంలో సోషల్ మీడియా యాక్టివిస్టులపై నిత్యం అక్రమ కేసులు, వేధింపులు, నిర్బంధాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ సమయంలో నిజం పక్షాన నిలబడిన మా ప్రతి సైనికుడికి అండగా నిలుస్తా. కచ్చితంగా న్యాయం గెలుస్తుంది' అని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో శుక్రవారం పోస్ట్ చేశారు. కాగా, రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగ పాలన దుర్యోధన, దుశ్శాసన దుర్నీతి లోకాన్ని తలపిస్తోంది. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ ప్రజల్ని చైతన్య పరుస్తున్న సోషల్ మీడియా యాక్టివిస్టులను కూటమి ప్రభుత్వం అడ్డూ, అదుపు లేకుండా వేధింపులకు గురి చేస్తోంది. ఈ నేపథ్యంలో బాధితులందరికీ అండగా ఉంటానని వైఎస్ జగన్ ధైర్యం నూరిపోశారు.

మెడికల్ పీజీ సీట్ల బ్లాకింగ్ స్కాంలో ఈడీ దూకుడు

▶ మొదటి పేజీ తరువాయి

కరీంనగర్ జిల్లా నగునూర్‌లోని ప్రతిమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, నల్లగొండ జిల్లా నార్కెట్‌పల్లిలోని కామినేని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఖమ్మంలోని మమత మెడికల్ కాలేజీ, సంగారెడ్డిలోని ఎంఎన్ఆర్ మెడికల్ కాలేజీ, రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని భాస్కర్ మెడికల్ కాలేజీ, మేడ్చల్‌లోని మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, మహబూబ్‌నగర్‌లోని ఎస్వీఎస్ మెడికల్ కాలేజీ, సూరారంలోని మల్లారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, పటాన్‌చెరులోని మహేశ్వర మెడికల్ కాలేజీ, చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కాలేజీ, డెక్కన్ కాలేజ్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రాంగణాల్లో ఈడీ సోదాలు జరిపింది. అందులో భాగంగా దర్యాప్తు కొనసాగిస్తున్న అధికారులు.. 12 కాలేజీలతో పాటు మరికొన్ని కాలేజీల యాజమాన్యాలకు కూడా సమన్లు జారీ చేసినట్టు తెలిసింది. అన్ని కాలేజీల ప్రతినిధుల నుంచి వివరాలు సేకరించడంతో పాటు పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుంటున్నారు. మొత్తం కాలేజీల నుంచి వివరాలు సేకరించిన తర్వాత కేసులో మరికొన్ని కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశాలున్నాయనే చర్చ జరుగుతోంది.

హైదరాబాద్‌లోనే ఉన్నా

▶ మొదటి పేజీ తరువాయి

ఘటనలో మీరు 'ఈస్ట్ ఇండియా కంపెనీ'అంటూ సంబోధించిన సంస్థను బ్లాక్‌లిస్టులో పెట్టగలరా. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనుల నుంచి ఆంధ్రా కాంట్రాక్టర్‌ను తొలగించే దుమ్ముందా. సీఎం హోదాలో ఒక కాంట్రాక్టు సంస్థకు గులాంగిరి చేస్తున్నావా'అని కేటీఆర్ మండిపడ్డారు.

పుండు ఒక చోట.. మందు మరోచోట

'మూసీ ప్రాజెక్టు బాధితులను పట్టించుకోకుండా మరోచోట సీఎం పాదయాత్ర చేస్తూ పుండు ఒక చోట అయితే మందు మరోచోట అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. వేల ఇళ్లను కూల్చివేసేందుకు ప్రణాళికలు వేసి..లక్షలాది మందిని నిరాశ్రయులను చేసే ప్రణాళిక వేసిన సీఎం దొడ్డిదారిన మరోచోట పాదయాత్ర డ్రామా చేస్తున్నారు. లక్షలాది మంది ఆక్రందనలకు కేరాఫ్‌గా మారిన హైదరాబాద్ మూసీ పరీవాహక ప్రాంతంలో పాదయాత్ర చేసే ధైర్యం, చిత్తశుద్ధి సీఎంకు లేదు. దశాబ్దాలపాటు వ్యర్థాలు కలుస్తుంటే అరవై ఏళ్ల కళ్లుండీ చూడలేని కబోదుల్లా కాంగ్రెస్ వ్యవహరించింది. మూసీ దోపిడీ ప్రాజెక్టు కన్సల్టెంట్లతో మూడురోజుల పాటు చర్చించే సమయం సీఎంకు ఉంది. కానీ ఆరు గ్యారంటీల అమలుపై సమీక్షించేందుకు సమయం లేదా. మోసపూరిత హామీలను పక్కన పెట్టి కమీషన్ల కోసం మూసీ ప్రాజెక్టును నెత్తిన పెట్టుకు న్నారు. పాదయాత్ర చేసినా పొర్లుదండాలు పెట్టినా మూసీ పరీవాహక ప్రాంత ప్రజల వేదన మీకు శాపంగా మారుతుంది'అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

నల్లగొండ నేతల అరెస్టు అక్రమం

ముఖ్యమంత్రి మూసీ పాదయాత్ర నేపథ్యంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్త లను పోలీసులు అరెస్టు చేస్తున్నారు. ప్రజాపాలన అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి, మంత్రులు పర్యటనలు చేసిన ప్రతీ సందర్భంలో బీఆర్ఎస్ నేతలను ముందస్తు, హౌస్ అరెస్టుల పేరుతో నిర్బంధానికి గురి చేస్తు న్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే మా నేతల హక్కులను ప్రభుత్వం కాలరాస్తోంది. ఎన్ని నిర్బంధాలకు గురిచేసినా కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి, హామీల అమలులో వైఫల్యంపై ప్రజల తరపున ప్రశ్నిస్తూనే ఉంటాం 'అని కేటీఆర్ పేర్కొన్నారు.

హ్యాపీ బర్త్ డే సీఎం రేవంత్

ఎక్స్ వేదికగా ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు, రాష్ట్ర గవర్నర్ తదితరుల శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎక్స్ వేదికగా భారత ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, కర్ణాటక, ఏపీ సీఎంలు సిద్దరామయ్య, ఎన్.చంద్రబాబునాయుడు, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, సినీనటుడు చిరంజీవి, అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్, యూకే కాన్సులేట్ జనరల్ గరెత్ విన్ ఓవెన్ తదితరులు శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో ఉన్నారు. శుక్రవారం ఉదయం నుంచే కాంగ్రెస్‌నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున జూబ్లీహిల్స్‌లోని రేవంత్ నివాసానికి క్యూ కట్టారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, డి.శ్రీధర్‌బాబులు కలిసి రేవంత్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాహుల్, ప్రియాంకలతో కలిసి సెల్ఫీ దిగుతున్న ఫొటోను మంత్రి కొండా సురేఖ రేవంత్‌కు బహూకరించారు. గాంధీభవన్‌లో సీఎం రేవంత్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ప్రభుత్వ టీచర్లకు గ్రేడింగ్!

▶ మొదటి పేజీ తరువాయి

ఆ టీచర్‌ను బాధ్యుడిని చేయాలని భావిస్తున్నారు. ఒక టీచర్ చెప్పే సబ్జెక్టులో వరుసగా ఐదేళ్ళ పాటు అతి తక్కువ ఫలితాలు వస్తే కొన్ని చర్యలు తీసుకునే అంశాన్ని కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసినట్లు సమాచారం. కాగా గ్రేడింగ్ విధానంపై అన్ని వర్గాలతో చర్చించి, అవసరమైన విధివిధానాలను రూపొందించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు..ఇలా మొత్తం 1,26,518 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ కలిపి 30,178 స్కూళ్ళుంటే, ఇందులో 28,80,809 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు.

టీచర్లకు గ్రేడింగ్ సరికాదు

రకరకాల పరీక్షల్లో ప్రతిభ చూపిన తర్వాతే ప్రభుత్వ టీచర్‌గా ఎంపిక చేస్తున్నారు. విద్యార్థుల ఉత్తీర్ణత ఆధారంగా ర్యాంకింగ్ ఇవ్వడం ఎంతమాత్రం సరికాదు. ప్రభుత్వ స్కూళ్ళకు వచ్చే పేద విద్యార్థుల నేపథ్యాన్ని ప్రభుత్వం తెలుసుకోవాలి. స్కూల్‌లో ఉండే సమయంలో తప్ప, ఇంటికెళ్ళితే చదివించే పరిస్థితి ఉండదు. ఈ విషయంలో తల్లిదండ్రుల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. అంతే తప్ప టీచర్లనే బాధ్యులను చేయడం సరికాదు.

– సయ్యద్ షౌకత్ అలీ (టీఎస్పీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు)

ముందు మౌలిక వసతులు కల్పించాలి

ప్రభుత్వ స్కూళ్ళలో చాలీ చాలని వసతులున్నాయి. పైగా ఈ స్కూళ్లలో పేద వర్గాల నుంచి వచ్చే విద్యార్థులే అత్యధిక సంఖ్యలో చదువుతున్నారు. వారికి నాణ్యమైన విద్య అందించాలని ప్రతి టీచర్‌కూ ఉంటుంది. మంచి ఫలితాలు రావాలంటే అందుకు తగిన వాతావరణం, వసతులు కల్పించాలి. మంచి ఫలితాలకు వీలుగా తగిన మార్పులు, చేర్పులు చేయాలి. ప్రైవేటు స్కూళ్ళతో పోటీ పెట్టడం సరికాదు. ర్యాంకింగ్ ఇవ్వడం ఎంతమాత్రం సరికాదు.

– పింగిలి శ్రీపాల్ రెడ్డి (పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు)

జిల్లా వార్తలు

ఏఎన్‌ఎం శిక్షణకు దరఖాస్తు గడువు పొడిగింపు

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని మహిళా ప్రాంగణంలో ఏఎన్‌ఎం శిక్షణ కోసం దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 16వరకు పొడిగించినట్లు ప్రాంగణం మేనేజర్ వేల్పుల విజేత తెలిపారు. ఇంటర్‌లో ఏ గ్రూప్ అయినా పూర్తిచేసి, 17 ఏళ్ల నిండిన మహిళా అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థులు ఎస్సెస్సీ, ఇంటర్ మెమోలు, 4నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్, కుల ధృవీకరణ పత్రాలే కాక రెండు ఫొటోలతో పాటు కమిషనర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, తెలంగాణ, హైదరాబాద్ పేరిట తీసిన రూ.200 డీడీతో తమ కార్యాలయానికి వస్తే ఆన్‌లైన్ చేస్తామని తెలిపారు.

'చర్యల్లో జాప్యం ఎందుకు?'

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం జిల్లాలో కస్టమ్స్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) వ్యవహారంలో అక్రమాలు జరిగినట్లు తేలినా మిల్లర్లపై చర్యల్లో ఎందుకు జాప్యం చేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లాలో సీఎంఆర్ విషయమై అక్రమాలు జరగగా, అధికారుల పాత్ర ఉందని తెలిపారు. కొణిజర్ల మండలంలోని ఓ మిల్లు యాజమాన్యాన్ని రూ.81 కోట్లు చెల్లించాలని ఆదేశించి వదిలేయడం సరికాదన్నారు. ఇకనైనా ఆస్తులు జప్తు చేసి బాధ్యులపై అధికారులపై చర్యలు తీసుకోవాలని ఓ ప్రకటనలో ఆయన డిమాండ్ చేశారు.

వర్క్‌బుక్‌ల సరఫరా కోసం టెండర్ల ఆహ్వానం

భద్రాచలంటౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ పరిధి ప్రాథమిక, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు వర్క్‌బుక్‌ల సరఫరా కోసం టెండర్లు స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. 3 నుంచి 5వ తరగతి విద్యార్థులు 5,611 మందికి 12,06,224 పేజీల పుస్తకాలు ముద్రించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రింటింగ్ ప్రెస్‌ల యజమానులు నిర్ణీత రుసుంతో తీసిన డీడీతో దరఖాస్తులను డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో ఈ నెల 12వ తేదీలోగా అందజేయాలని సూచించారు. ఐటీడీఏ కార్యాలయంలో 13న టెండర్లు పరిశీలించి ఖరారు చేస్తామని తెలిపారు.

జిమ్నాస్టిక్స్ కోచ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జిమ్నాస్టిక్స్ కోచ్ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్ఓ టి.సునీల్‌కుమా ర్‌రెడ్డి తెలిపారు. ఎన్ఐఎస్ పూర్తిచేసిన వారు లేదా సీనియర్ క్రీడాకారులు ఈనెల 14వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా జిల్లా యువజన క్రీడల శాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

గైర్హాజరీ కార్మికులకు కౌన్సెలింగ్



సింగరేణి ప్రధాన కార్యాలయం

- సింగరేణి వ్యాప్తంగా ఏరియాల్లో నిర్వహణ
- గతంలో గనుల వారీగా కార్మికులకు కౌన్సెలింగ్
- ఇప్పుడు జీఎం కార్యాలయంలో కుటుంబీకుల సమక్షాన...

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఉద్యోగులకు రకరకాల సౌకర్యాలు కల్పిస్తుండగా.. పనిపై అనుభవం లేని వారికి శిక్షణ కూడా ఇపిస్తున్నారు. అయితే, కొందరు విధులు నిర్వర్తిస్తూ సంస్థ అభివృద్ధికి సహకరిస్తుండగా, మరికొందరు గైర్హాజరవుతున్నారు. ఈమేరకు కౌన్సెలింగ్ నిర్వహించి మార్పు తీసుకురావాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈనెల 5వ తేదీ మంగళవారం నుంచి కుటుంబీకులతో సహా ఏరియా జీఎం కార్యాలయాల్లో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. గైర్హాజరీ కార్మికుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడం, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉంటే మెడికల్ బోర్డుకు రిఫర్ చేయడం ఈ కౌన్సెలింగ్ లక్ష్యంగా చెబుతున్నారు. ఆతర్వాత కూడా విధులకు గైర్హాజరైతే డిస్మిస్ చేసేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు సమాచారం.

0–75 మస్టర్లలోపు 1900 మంది

సింగరేణి వ్యాప్తంగా 24 భూగర్భగనులు, 18 ఓపెన్ కాస్ట్ గనులు, అనుబంధ విభాగాల్లో 39,640 మంది పనిచేస్తున్నారు. వీరిలో ఈ ఏడాది సెప్టెంబర్ 30వ తేదీ వరకు 0 నుంచి 75 మస్టర్లలోపు పనిచేసిన సుమారు 1,900 మందిని గుర్తించారు. గత నెల రోజులుగా గనులు, విభాగాల్లో వీరికి కౌన్సెలింగ్ ఇచ్చినా మార్పు రాకపోవడంతో మంగళవారం నుంచి జీఎం కార్యాలయాల్లో కుటుంబాలతో సహా కౌన్సెలింగ్ ప్రారంభించారు. కాగా, తక్కువ మస్టర్లు కలిగిన కార్మికుల్లో మణుగూరు ఏరియా నుంచి 597 మంది, కొత్తగూడెం ఏరియాలో 121 మంది, ఇల్లెందులో 302, ఆర్జీ–1లో 175, ఆర్జీ–2లో 108, ఆర్జీ–3లో 126, భూపాలపల్లిలో 262, బెల్లంపల్లిలో 9, మందమర్రిలో 79, శ్రీరాంపూర్‌లో 114, ఎస్టీపీసీలో ఒకరు ఉన్నారు.

ఏటా 100 మస్టర్లు తప్పనిసరి

సంస్థలో ఉద్యోగిగా కొనసాగాలంటే వారానికి రెండు, ఏటా 52 వారాల్లో 100 మస్టర్లు తప్పనిసరి చేయాల్సి ఉంటుంది. అయితే అండర్‌గ్రౌండ్‌లో పనిచేసే ఉద్యోగి 190 మస్టర్లు, సర్ఫేస్ విభాగాల్లో 240 మస్టర్లు చేస్తే బోనస్, లాభాల వాటా, ఇతర సదుపాయాలు వర్తిస్తాయి. కానీ కొందరు ఉద్యోగులు విధులకు సరిగ్గా హాజరుకాకపోవడంతో కౌన్సెలింగ్ నిర్వహించాలని యాజమాన్యం సిద్ధమైంది.

అందరినీ విధుల్లోకి రప్పించడమే ధ్యేయం



కొత్తగూడెం ఏరియాలో గడచిన తొమ్మిది మాసాల్లో కనీసం 75మస్టర్లు చేయని కార్మికులను గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చాం. కానీ పది శాతం మందిలోనే మార్పు వచ్చింది. దీంతో మిగతా వారికి కుటుంబలతో సహా జీఎం కార్యాలయంలో కౌన్సెలింగ్ ఇవ్వాలని నిర్ణయించాం. ఉద్యోగులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నందున విధులకు రప్పించాలనేదే మా ధ్యేయం.

– ఎం.శాలేంరాజు, కొత్తగూడెం ఏరియా జీఎం

ప్రతీ టన్ను బొగ్గుపై రూ.6 వేలు నష్టం


సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి



వెంకటేశ్వరరెడ్డి, డైరెక్టర్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి పరిధిలోని భూగర్భగనుల్లో ప్రతీ టన్నుకు బొగ్గు ఉత్పత్తికి సుమారు రూ.10 వేల వ్యయం అవుతుండగా.. అమ్మడం ద్వారా రూ.4వేలే వస్తున్నాయని, తద్వారా రూ.6 వేల నష్టం వాటిల్లుతోందని సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) జి.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. కొత్తగూడెంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఓపెన్‌కాస్ట్ గనుల్లో ప్రైవేట్ సంస్థలు రోజుకు సుమారు 14 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తీస్తుండగా, భారీ యంత్రాలు కలిగిన సంస్థ తరఫున మాత్రం 2లక్షల క్యూబిక్ మీటర్లు తీయడమే కష్టంగా మారిందన్నారు. ఈ మేరకు ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుపై ఉన్నతాధికారులు సహా కార్మికుడి వరకు దృష్టి సారించాలని, భూగర్భ గనుల్లో యంత్రాల పనిగంటలు పెంచితేనే లక్ష్యం మేరకు ఉత్పత్తి సాధ్యమవుతుందని తెలిపారు. కాగా, కొందరు కార్మికుల పనితీరు మారేలా యూనియన్ నాయకులు దృష్టి సారించాలని, అధికారులు కూడా చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. సంస్థలో బొగ్గు అమ్మకాల ద్వారా కేవలం 30శాతం లాభాలే వస్తున్నందున ఈ పరిస్థితి మారాల్సి ఉందని తెలిపారు. గతనెలలో 'ఉజ్వల సింగరేణి – కార్మికుల పాత్ర' అంశంపై నిర్వహించిన సదస్సుల ఫలితాలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సి ఉందని డైరెక్టర్ చెప్పారు.

నవ లిమిటెడ్‌కు 'రాష్ట్ర ఇండస్ట్రీ అవార్డ్'



మంత్రి నుంచి అవార్డు స్వీకరిస్తున్న నవలిమిటెడ్ యాజమాన్యం

పాల్వంచ: పాల్వంచలోని నవ లిమిటెడ్ సంస్థకు రాష్ట్ర ఇండస్ట్రీ అవార్డ్–2023 దక్కింది. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా కంపెనీ సెక్రటరీ వీఎస్ఎన్.రాజు, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ సుల్తాన్ బేగ్, జనరల్ మేనేజర్(సీఎస్ఆర్) ఎంజీఎం.ప్రసాద్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా యూనిట్ హెడ్, వైస్ ప్రెసిడెంట్ ఎల్‌వీ.శరత్‌బాబు మాట్లాడుతూ పారిశ్రామికాభివృద్ధిలో నవ లిమిటెడ్ కృషిని గుర్తించి అవార్డు అందజేశారని తెలిపారు.

ఏడేళ్లయినా జాడే లేని బోర్డు



జమలాపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం

- జమలాపురం ఆలయ ట్రస్టుబోర్డు ఏర్పాటులో జాప్యం
- ఫలితంగా ఆలయ అభివృద్ధిపై నీలినీడలు
- దాతలు చేపట్టిన నిర్మాణాలే తప్ప ప్రభుత్వం చొరవ శూన్యం
- పర్యవేక్షణ సైతం ఇన్‌చార్జ్ ఈఓతోనే సరి

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పిలిచే ఎర్రుపాలెం మండలంలోని జమలాపురం శ్రీవెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి పాలక మండలి (ట్రస్టు బోర్డు) ఏర్పాటులో ఎడతెగని జాప్యం జరుగుతోంది. ఫలితంగా ఆలయ అభివృద్ధిలో ముందడుగు పడటం లేదు. 2017లో ఏర్పాటు చేసిన పాలక మండలి గడువు ముగిసి ఏడేళ్లు దాటినా పాలకుల్లో చలనం లేకపోవడం గమనార్హం.

పాలకమండలి ఉంటే..

ఆలయానికి పాలకమండలి ఉంటే అభివృద్ధికి చొరవ తీసుకునే అవకాశముంటుంది. ప్రభుత్వం నుంచి నిధుల మంజూరుకు ప్రయత్నిస్తూనే దాతలను కలిసి విరాళాల సేకరణకు దోహదపడతారు. అంతేకాక అభివృద్ధి, ఉత్సవాల సమయాన ఏర్పాట్ల పర్యవేక్షణ సులువవుతుంది. కానీ, పాలకమండలి లేక ఇవేవీ జరగడం లేదు. ఇది పక్కన పెడితే అటు ప్రభుత్వం, ఇటు అధికారులైనా చొరవ చూపడం లేదు. దీంతో దాతల చేయూతతో చేపట్టిన నిర్మాణాలే తప్ప ఆలయ ఆవరణలో ఎలాంటి సౌకర్యాల కల్పన ఊసే లేదు. ఇటీవల ఆలయ సందర్శనకు వచ్చిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసిన పలువురు పాలకమండలి విషయమై విన్నవించారు. జిల్లా నుంచి డిప్యూటీ సీఎంతో పాటు ఇద్దరు మంత్రులు ఉన్నా పేరెన్నికగన్న జమలాపురం ఆలయానికి ట్రస్ట్ బోర్డు ఏర్పాటులో జాప్యం జరుగుతుండటంపై భక్తులు పెదవి విరుస్తున్నారు.

ఈఓ నియామకంలోనూ అలసత్వం

జమలాపురం ఆలయ నిర్వహణ, పర్యవేక్షణ కోసం అసిస్టెంట్ కమిషనర్ స్థాయి అధికారిని నియమించాలి. కానీ, దశాబ్ద కాలంగా ఇన్‌చార్జ్ ఈఓతోనే సరిపెడుతున్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఈఓగా ఉన్న జగన్మోహన్‌రావుకు ఖమ్మంలోని శ్రీనర్సింహస్వామి గుట్ట దేవాలయం, మారెమ్మ ఆలయం, కూసుమంచి మండలం జీళ్లచెరువులోని రామాలయం, శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, మధిరలోని మృత్యుంజయస్వామి వారి ఆలయాల బాధ్యతలు కూడా అప్పగించారు. దీంతో సదరు అధికారి ఏ ఆలయ నిర్వహణపైనా దృష్టి సారించలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా వారానికి ఒకటి, రెండు రోజులు మాత్రం వస్తుండటంతో పనులన్నీ సిబ్బందితోనే కానిచ్చేయాల్సి వస్తోంది. ఓ వైపు పాలక మండలి లేక, మరోవైపు రెగ్యులర్ ఈఓ లేక ఆలయ అభివృద్ధి, నిర్వహణ కష్టంగా మారిన తరుణాన ఇకనైనా ప్రభుత్వం స్పందించాలని భక్తులు కోరుతున్నారు.

త్వరలోనే నోటిఫికేషన్ వచ్చే అవకాశం



జమలాపురం ఆలయ పాలక మండలి నియామకానికి త్వరలో నోటిఫికేషన్ వెలువడే అవకాశముంది. ఆలయ చైర్మన్‌గా ఫౌండర్ ట్రస్టీ వ్యవహరిస్తారు. నోటిఫికేషన్ వస్తే మరో 13మంది సభ్యుల నియామకం జరుగుతుంది. వీలు మేర అందుబాటులో ఉంటూ భక్తులకు ఇబ్బంది లేకుండా పర్యవేక్షిస్తున్నా.

–కె.జగన్మోహన్‌రావు, ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ

ఇంకెప్పుడు బోర్డు ఏర్పాటు చేస్తారు?



జమలాపురం ఆలయ అభివృద్ధిపై పాలకులు చిత్తశుద్ధి చూపడంలేదు. గత ప్రభుత్వాల్లోనూ ఇలాగే ఉంది. దాతలే రూ.కోట్ల నిధులతో నిర్మాణాలు చేపట్టారు తప్ప ప్రభుత్వం తరఫున జరిగిన పనులేవీ లేవు. వాహనాల పార్కింగ్ సహా అన్నీ అస్తవ్యస్తంగా ఉన్న నేపథ్యాన ఇకనైనా స్పందించాలి.

–నూతక్కి నర్సింహారావు, రేమిడిచర్ల

అభివృద్ధికి నిధులు కేటాయించాలి



ఎంతో ప్రసిద్ధి చెందిన శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించి నిధులు మంజూరు చేస్తే బాగుంటుంది. ఇక్కడ దాతలు చేపట్టిన నిర్మాణాలే కనిపిస్తున్నాయి. చిన్న తిరుపతిగా పేరున్న జమలాపురం ఆలయ అభివృద్ధిపై దృష్టి సారించాలి.

–గూడూరు వెంకటసత్యనారాయణరెడ్డి, బనిగండ్లపాడు